ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
5
శనివారం, 17 ఆగస్టు 2024



నేడు ఆస్పత్రుల్లో ఓపీ సేవల బంద్

మహిళా డాక్టర్‌పై హత్యాచారానికి నిరసన

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 16: కలకత్తాలో మహిళా డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ శనివారం ఖమ్మం జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో ఓపీ సేవలు బంద్ చేస్తున్నట్టు ఐఎంఏ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కంభంపాటి నారాయణరావు, డాక్టర్ జగదీష్ తెలిపారు. నేషనల్ ఐఎంఏ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నిరసన చేపడుతున్నట్టు చెప్పారు. ఖమ్మం నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లోని అన్ని హాస్పిటల్స్ ఓపీ సేవలు నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి వైద్యులతో, ఆస్పత్రుల యాజమాన్యాలతో సహకరించాలని కోరారు.

మహిళలకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

- దిష్టిబొమ్మ దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు 16: తెలంగాణ రాష్ట్రంలోని ప్రతీ మహిళకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఉచిత బస్సు పథకంలో భాగంగా మహిళపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఎదుట కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే ఓర్వలేక మహిళలను అగౌరవ పరిచేలా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాయల నాగేశ్వరరావు



అప్రమత్తంగా ఉండాలి

- రోజూ ఫీవర్ సర్వే చేయాలి
- పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్య పరచాలి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్
- వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష

6

- జిల్లా జనరల్ ఆస్పత్రి తనిఖీ
- కూసుమంచిలో సేవల పరిశీలన

వర మహాలక్ష్మీ నమోస్తుతే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు





శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్న దృశ్యం, హాజరైన మహిళలు..

ఖమ్మం నగరంలో వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం ఖానాపురం హవేలి/భద్రాచలం/ ఖమ్మం మార్కెట్, ఆగస్టు 16: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మీ వ్రతాలను కన్నుల పండుగగా నిర్వహించుకున్నారు. శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు శుక్లపక్షం రోజున వచ్చిన రెండో శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారు. సౌభాగ్యం వెల్లివిరియాలని, కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు. ఖమ్మం నగరంలోని నరసింహ స్వామి గుట్ట ఆలయంలో లక్ష్మీ దేవి అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని గుంటు మల్లేశ్వరస్వామి ఆలయం, ఇందిరానగర్ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంతోపాలు పలు ఆలయాల్లో భక్తులు పూజల్లో పాల్గొని అమ్మవారి దీవెనలు పొందారు.

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. అర్చకులు రామ అష్టోత్తరం, లక్ష్మీ సహస్రనామార్చనలతో పూజలు నిర్వహించిన అనంతరం కుంకుమ పూజ, దూపదీప నైవేద్యాలు, ప్రత్యేక నివేదనలు మంగళ హారతి గావించారు. దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ఉప ప్రధాన అర్చకుడు అమరవాది శ్రీనివాస రామానుజం, ముఖ్యఅర్చకుడు పొడిచేటి రామభద్రాచార్యులు, కోటి విష్ణువర్దనాచార్యులు పాల్గొన్నారు.

భగ్గుమన్న పూల ధరలు

అసలే శ్రావణ శుక్రవారం.. ఆపై వరలక్ష్మీ వ్రతం... కావడంతో పూలు, పండ్లకు ఖమ్మం నగరంలో వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చామంతి, గులాబీలను 50గ్రాములు రూ.50కు విక్రయించారు. కేజీ మల్లె పూలు రూ.2వేల నుంచి రూ.2,500, కిలో విరజాజి రూ. 1,200 నుంచి 1,500, బంతి కేజీ రూ.400, కాగడా మల్లె కిలో రూ.2వేల నుంచి రూ. 2,500 వరకు పలికాయి. ఇక వాటి అల్లికకు కట్టు కూలి అదనంగా కిలోకు రూ.200 కలిపి అమ్మకాలు జరిపారు. గత నెలలో కిలో మల్లెలు రూ.400 నుంచి రూ.500 ఉండగా, ప్రస్తుతం నాలుగు రెట్లు అదనంగా రూ. 2 వేలకు పైగా పలకడం విశేషం.




బైక్‌పై హుషారుగా...

నగరంలో మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ఖమ్మం నగరంలో యాక్టివా బైక్‌పై సుడిగాలి పర్యటన సాగించారు. అనేక ప్రదేశాలకు వెళ్లి ప్రజలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకుని సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం మంత్రి తుమ్మల బైక్ డ్రైవ్ చేస్తూ మిగిలిన అధికారులను కూడా ద్విచక్రవాహనాలపైనే తనతోపాటు పర్యటింపచేశారు. మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, తదితరులు కూడా మంత్రి వెంట పర్యటనలో పాల్గొని కాలనీలను సందర్శించారు. ముందుగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఏరియా ప్రకాష్‌నగర్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ధంసలాపురం ఎగ్జిట్ పాయింట్ వద్దకు వెళ్లి పనులు పరిశీలించి త్రీటౌన్ ప్రాంతాన్ని కలిపే డబుల్‌రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మంత్రి పర్యటనలో కాంగ్రెస్ నాయకులు సాధురమేష్‌రెడ్డి, కమర్తపు మురళి, తిలక్ ఆళ్ల అంజిరెడ్డి, కొప్పెర ఉపేందర్, గజ్జల వెంకన్న, ఉపేందర్, ఖాదర్‌బాబా, మందడపు బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన, శ్రావణమాసం మంచిరోజులు కొనసాగుతున్న నేపథ్యంలో కార్పొరేషన్, నామినేటెడ్ పదవులపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సక్సెస్ కోసం నిన్నటి వరకు శ్రమించిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు నామినేటెడ్ పదవులపై దృష్టిపెట్టారు. మంత్రుల చుట్టూ కొందరు తిరుగుతుండగా, మరికొందరు హైదరాబాదులో లాబీయింగ్ సాగిస్తున్నారు.



ఈ సారైనా దక్కేనా..?

నామినేటెడ్ పదవులపై అధికార పార్టీ నేతల్లో ఆశలు

- ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటివరకు నలుగురికే దక్కిన చాన్స్
- తుమ్మల, రేణుకాచౌదరి వర్గీయులకు మొండిచేయి
- ఆశావహుల్లో ఎవరికి వారుగా ప్రయత్నాలు
- అర్హుల ఎంపికలో ముగ్గురు మంత్రుల్లో కనిపించని సమన్వయం
- తమకు అవకాశం ఇవ్వాల్సిందేనంటున్న సీనియర్లు

ఖమ్మం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తొలివిడత నామినేటెడ్ పదవుల్లో జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వర్గం నుంచి వైరాకు చెందిన నాయుడు సత్యనారాయణకు హస్తకళల చైర్మన్ పదవి లభించగా, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గీయుడు మువ్వా విజయ్ బాబుకు ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పదవి లభించింది. అలాగే గతంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఓటమి చెందిన కాంగ్రెస్ నేత రాయల నాగేశ్వరరావుకు గిడ్డంగుల సంస్థ చైర్మన్ పదవి వరించింది. భద్రాచలం అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిచెందిన పొదెం వీరయ్యకు రాష్ట్ర అటవీ అభివృద్ధి చైర్మన్ సంస్థ పదవి వరించింది. అయితే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వర్గీయులకు, కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి వర్గీయులకు నామినేటెడ్ పదవుల్లో ఛాన్స్ లభించలేదు. అలాగే సుదీర్ఘకాలంగా భట్టి విక్రమార్క వర్గీయులుగా, రేణుకాచౌదరి వర్గీయులుగా రాజకీయాల్లో ఉన్న వారిలో కూడా కొందరికి అవకాశం రాలేదు. జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో పలువురు నాయకులు టికెట్లు ఆశించి ఎన్నికల సమయంలో పనిచేశారు. అయితే వారికి అసెంబ్లీ టికెట్లు దక్కకపోవడంతో నామినేటెడ్ పదవులపై హామీలు ఇచ్చారు. దీంతో ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు, అశ్వారావుపేట, భద్రాచలం, పినపాక నియోజకవర్గాల నుంచి పలువురు నాయకులు... రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులతో పాటు కార్పొరేషన్ డైరెక్టర్ పదవులు, దేవాలయ కమిటీలు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, జిల్లా స్థాయిలో గ్రంధాలయ సంస్థ చైర్మన్ పదవులతో పాటు ఆర్టీసీ, రవాణ, తదితర కమిటీల పదవులపై ఆశలు పెట్టుకున్నారు.

కొందరు సీనియర్ నాయకులు పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ప్రతిపక్షంలో ఉంటూ రాజకీయాల్లో తిరుగుతున్నారు. ఇప్పటికే కొందరు నేతల్లో నియామక పదవులు రాలేదని అసంతృప్తి ఉంది. జిల్లాలో తమ వర్గానికి చెందిన నాయకులకు నియామక పదవుల్లో అవకాశాలు ఇవ్వలేదని, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి కూడా అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. మొదటినుంచి పార్టీలో ఉన్న వారికి కాకుండా మధ్యలో వచ్చిన వారికి నామినేటెడ్ పదవులు ఎలా ఇస్తారని, పార్టీకోసం పనిచేసిన వారికి పదవులు ఇవ్వాలని, పైరవీలు చేసుకునే వారికి ఇవ్వద్దని, అధిష్టానం వద్ద రేణుకాచౌదరి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ దృష్టికి

(మిగతా 6వ పేజీలో)



హరీష్‌రావువి పచ్చి అబద్ధాలు

- 'సీతారామ' ఘనత ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కారుదే...
- బీఆర్ఎస్ బతుకు బస్టాండ్ అయింది.. : ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి

సత్తుపల్లి, ఆగస్టు 16: సీతారామ ప్రాజెక్టు విషయంలో మాజీ మంత్రి హరీష్‌రావు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. సత్తుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టును గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.7వేల కోట్లు ఖర్చు చేయగా 40శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయని, మిగతా పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తూ నేడు జిల్లాకు గోదావరి జలాలను తీసుకువచ్చిందన్నారు. రైతు రుణాలను ముందే చెప్పినట్లుగా ఆగస్టు 15న పూర్తి చేసిన కాంగ్రెస్ పార్టీపై విమర్శలు సరికాదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజాపాలన సాగిస్తున్న ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలని సూచించారు. సీతారామ ప్రాజెక్టు విషయంలో కేవలం మోటార్లు బిగించారని, విద్యుత్ కనెక్షన్ కూడా ఇవ్వలేదని, ఇరిగేషన్, ఆర్థిక శాఖల మంత్రిగా పనిచేసిన హరీష్‌రావుకు లెక్కలు తెలియవా అని ప్రశ్నించారు. పదేళ్లలో చేయలేని పనులు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ 7నెలల్లోనే చేసి చూపించిందన్నారు. మంత్రి సీతక్కపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తాను ఖండిస్తున్నానని, రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగా బీఆర్ఎస్ బతుకు బస్టాండ్ అయిందన్నారు. కార్యక్రమంలో టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

అది 'సత్తుపల్లి' ప్రాజెక్టు

సీతారామ ప్రాజెక్టు ప్రారంభం పేరుతో కాంగ్రెస్ షో



ఖమ్మంలో మీడియా సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

- సాగర్ జలాలు అందుతున్న ప్రాంతానికే గోదావరి జలాలు ఎందుకో?
- గిరిజన ప్రాంతాలకు చుక్కనీరేది..
- టీడీపీ నేతల విమర్శ

ఖమ్మం మామిళ్లగూడెం, ఆగస్టు 16: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించిన సీతారామ.. కేవలం సత్తుపల్లి ప్రాజెక్టు అని తెలుగుదేశంపార్టీ నాయకులు కేతినేని హరీష్, కొండబాల కరుణాకర్, మల్లెపాటి అప్పారావు ఎద్దేవా చేశారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించింది సీతారామ ప్రాజెక్టా లేక సత్తుపల్లి ప్రాజెక్టా అని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్ట్ అయితే ఆ కాలువ ప్రయాణించే 140కిలో మీటర్ల మేర గిరిజన ప్రాంతంలో ఎక్కడ భూములకు నీరు విడుదల చేశారో తెలపాలన్నారు. గోదావరి జలాలను జూలూరుపాడు నుంచి ఇప్పటికే వాడకంలో ఉన్న సాగర్ ఆయకట్టుకి నీరు ఇవ్వడాన్ని కృష్ణా-గోదావరుల అనుసంధానం అని ఎలా అంటారని ప్రశ్నించారు. ఎడారి ప్రాంతంగా వున్న గిరిజన ప్రాంతాన్ని వదిలేసి, ఇప్పటికే నీటి సౌకర్యం వున్న సత్తుపల్లి ప్రాంతానికి నీరు తీసుకపోవటం గిరిజన ప్రాం తానికి ద్రోహం చేయటం కాదా అని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లాలో ఉన్న మంత్రులు... కామేపల్లి, కారేపల్లి లాంటి గిరిజన ప్రాంతాలను గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రభుత్వానికి సీతారామ ప్రాజెక్ట్ ఆయకట్టుకి నీరు ఇచ్చే వుద్దేశం వుంటే దానిని ఎందుకు పాలేరు చెరువుకు అనుసంధానం చేయటం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా బహిరంగ సభలో సీతారామ ప్రాజెక్ట్‌కు సంబంధించిన డీపీఆర్‌ను కేసీఆర్ తయారు చేయలేదు అనటంలో అంతర్యం ఏమిటన్నారు. సీఎం పర్యటనలో ఏ ఒక్క ప్రజాసమస్య గురించి మాట్లాడ లేదని విమర్శించారు. . ఈ సమావేశంలో నున్నా నవీన్, కర్నాటి సీతారాములు, టీడీపి నాయకులు పాలడుగు క్రిష్ణప్రసాద్, నాగార్జున శ్రీనివాస్, కర్నాటి అశ్వనీకుమార్, కస్నేటి పృధ్వీ, కోనేరు అన్వేష్, నాగండ్ల లక్ష్మణ్, చింతనిప్పు నాగేశ్వరావు, దామళ్ల శివాజి, పిరంగి మంగయ్య, సాయి పాల్గొన్నారు.

రామయ్య భూముల్లో మళ్లీ వివాదం



రెవెన్యూ అధికారులను ప్రశ్నిస్తున్న ఈవో రమాదేవి

- కోర్టు ధిక్కరణ కేసున్నా పురుషోత్తపట్నంలో అక్రమ నిర్మాణాలు
- అడ్డుకునేందుకు వెళ్లిన దేవస్థానం ఈవోపై దాడికి యత్నం
- యటపాక ఆర్ఐని నిలదీసిన ఈవో రమాదేవి

భద్రాచలం, ఆగస్టు 16: ఏపీలోని అల్లూరి జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నంలో ఉన్న భద్రాద్రి రామయ్య భూముల్లో మళ్లీ ఆక్రమణలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో ఏపీ హైకోర్టు భద్రాద్రి దేవస్థానానికి అనుకూలంగా తీర్పు ఇచ్చినా దానిని నిర్ణీత సమయంలో అమలు చేయకపోవడంతో భద్రాద్రి దేవస్థానం రాష్ట్రీయ వానరసేన కోర్టు ధిక్కరణ పిటీషన్ హైకోర్టులో దాఖలు చేశాయి. ఈ క్రమంలో అక్రమ నిర్మాణాలు చోటు చేసుకోకుండా చూడాల్సిన ఏపీ రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తుండటంతో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చోటు చేసుకుంటున్నాయని దేవస్థానం అధికార వర్గాలు ఆరోపిస్తున్నాయి. శ్రీగోకులానికి ఎదురుగా ఉన్న ఖాళీ భూముల్లో గత రెండు నెలలుగా నిర్మాణం చోటు చేసుకుంటున్నా రెవెన్యూ శాఖ అధికారులు స్పందించకపోవడంతో శుక్రవారం భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవో భవానీరామకృష్ణారావు, పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, లింగాల సాయిబాబాతోపాటు వైదిక పరిపాలన సిబ్బంది అక్కడికి చేరుకొని అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. ఇదే సమయంలో కొందరు వ్యక్తులు ఈవో ఎల్.రమాదేవిపై దాడికి ప్రయత్నించగా దేవస్థానం సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సమయంలో పలువురు సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా యటపాక సీఐ పార్థసారధి తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని నిర్మాణం చేస్తున్న వారిని పనులు ఆపాలని కోరారు.

మీరు తీయిస్తారా... మేమే తొలగించాలా?

'నేను కూడా రెవెన్యూ డిపార్టు నుంచే వచ్చా. దేవస్థానం భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే మీరేం చేస్తున్నారు..' అని యటపాక ఆర్ఐ బాపిరాజును భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి నిలదీశారు. మేం తీసేందుకు వస్తే మాత్రం మీరొస్తున్నారు... వాళ్ల నిర్మాణ పనులు చేస్తుంటే మీరు దగ్గరుండి ఏం చేస్తున్నారు..? అని ఆర్ఐని ఈవో ప్రశ్నించారు. రామయ్య భూముల్లో అక్రమ నిర్మాణం చేస్తుంటే పోలీసు అధికారులు మాకు సంబంధం లేదంటున్నారు... రామయ్య భూములు కాపాడమంటే మీరు ఇలానా వ్యవహరించేది..? అంటూ ఈవో అసహనం వ్యక్తంచేశారు.

పురుషోత్తపట్నంలోని రామాలయ భూములకు సంబంధించి 250 కేసులు న్యాయస్థానంలో వేయగా అన్నింటిలో కూడా రామయ్యకు అనుకూలంగా తీర్పులొచ్చాయని ఈవో రమాదేవి తెలిపారు. 'యటపాక పోలీసు అధికారులకు 46 ఫిర్యాదులు చేసినా ఇంతవరకు స్పందించిన దాఖలాలు లేవు.. ఆదివాసీలను, ఆడవాళ్లను అడ్డంపెట్టి రామయ్య భూముల్లో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు...' అని ఆమె తెలిపారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపాలి

- శాంతిభద్రతల పరిరక్షణలో కఠినంగా వ్యవహరించాలి
- మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి

కొత్తగూడెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల పని తీరు భేష్ అని, జిల్లాలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పని చేసే పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వారి కదలికలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటుచేసుకోవాలని మల్టీజోన్-1 ఐజీపీ (ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. కొత్తగూడెం హేమచంద్రాపురంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం జిల్లా పోలీసు అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ తెలంగాణ-ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నిషేధిత మావోయిస్టులు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండ నివారించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి వంటి మత్తుపదార్థాల అక్రమ రవాణాను అరికట్టడంలో జిల్లా పోలీసుల పని తీరు ప్రశంసనీయమని, అంతే ఉత్సాహంతో పని చేయాలని కోరారు. ఫైళ్లను క్రమపద్ధతిలో అమర్చుకోవాలని సూచించారు. అనంతరం హెడ్‌క్వార్టర్స్ ప్రాంగణంలో ఐజీ, ఎస్పీ మొక్కలు నాటారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ పరితోష్ పంకజ్, భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ సంక్వర్, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు డీఎస్పీలు చంద్రభాను, సతీష్‌కుమార్, రవీందర్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, ఏవో జయరాజు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు. తొలుత ఐజీపీకి ఎస్పీ రోహిత్‌రాజు స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో పోలీసుల పనితీరును, నిషేధిత మావోయిస్టుల కదలికలు, ప్రస్తుత స్థితిగతులను వివరించారు.

టెన్నిస్ క్రీడతో ఆరోగ్యం..

మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి



క్రీడాకారులతో ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

పాల్వంచ, ఆగస్టు 16 : టెన్నిస్ క్రీడతో మనిషి ఉత్తమమైన ఆరోగ్యం పొందుతాడని మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం పాల్వంచ శ్రీనివాసకాలనీలోని సింథటిక్ టెన్నీస్ కోర్టులో ఉదయం వామప్ చేశారు. కొద్ది సేపు క్రీడాకారులతో టెన్నీస్ ఆడి రోజువారీ వ్యాయామాన్ని ముగించారు. టెన్నీస్ అసోసియేషన్ సభ్యులు ఐజీని బొకేలతో, శాలువాతో సత్కరించారు. అనంతరం ఐజీ క్రీడాకారులతో టెన్నీస్ క్రీడ గురించి చర్చించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఇంత మంచి టెన్నీస్ కోర్టును సాధించిన జిల్లా అసోసియేషన్‌ను అభినందించారు. ఈ టెన్నీస్ కోర్టులో ఆడుతున్న క్రీడాకారులు రానున్న రోజుల్లో చాంపియన్స్‌గా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టెన్నీస్ అసోసియేషన్ చీఫ్‌కోచ్ అన్నం వెంకటేశ్వర్లు, కృష్ణారావు, జిల్లా టెన్నీస్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ యుగంధర్‌రెడ్డి, పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, టౌన్ ఎస్ఐ సుమన్, టెన్నీస్ క్రీడాకారులు భాస్కర్, కబీర్, వంశీ, రాజు, కోచ్ అన్నం శ్రీకాంత్ పాల్గొన్నారు.

తల్లి చెంతకు చిన్నారి

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 16: 45 రోజులుగా చిన్నారి కోసం ఎదురుచూస్తున్న తల్లికి అధికారులు చిన్నారిని శుక్రవారం అప్పగించారు. ఖమ్మం నగరంలోని బాలల సదనంలో ఉన్న చిన్నారిని శుక్రవారం నగరంలోని బాలరక్షా భవన్‌లోని సీడబ్ల్యూసీ(చైల్డ్ వెల్ఫేర్ కమిటి) బెంచ్ సభ్యుల బృందం చిన్నారి తల్లి స్వప్నకు కౌన్సెలింగ్ నిర్వహించి చిన్నారిని అప్పగించారు. చిన్నారి యోగక్షేమాలను ఎప్పటికప్పుడు ఐసీడీఎస్ అధికారులు పర్యవేక్షిస్తారని తల్లికి వివరించారు. ఖమ్మం నిజాంపేటకు చెందిన స్వప్నకు రఘునాధపాలేనికి చెందిన ఓ యువకుడిని 2021లో ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి 2022లో బాబు జన్మించాడు. బాబు జన్మించిన నెల రోజులకే తండ్రి ఓ ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాబు తల్లి వద్ద ఉంటున్నాడు. చిన్నారి నాయనమ్మ బాబుని నేను పెంచుకుంటాను నీవు మళ్లీ పెళ్లి చేసుకో అంటూ బాబును దత్తతకు తీసుకుంటున్నట్లు దత్తపత్రం రాయించుకుంది. కొన్ని రోజుల అనంతరం బాబును చూడాలని చిన్నారి తల్లి అత్తకు ఫోన్ చేయగా ఆమె సంబంధంలేని మాటలు చెప్పటంతో అనుమానం వచ్చి బాబు అత్త వద్ద లేడని తెలుసుకోని పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసుల విచారణలో బాబు హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. గత బుధవారం సీడబ్ల్యూసీ అధికారుల సమక్షంలో ఆ చిన్నారిని నగరంలోని బాలల సదనానికి తరలించారు. శుక్రవారం బాబును తల్లికి అప్పగించారు. చిన్నారి అదృశ్యం వెనుక ఉన్న వారిని కనుగొనేందుకు పోలీసులు విచారణ వేగవంతం చేశారు. త్వరలోనే చిన్నారి అదృశ్య వెనుక ఉన్న వారి పేర్లు బైటకురానున్నాయి.

సమష్టి కృషితో నిర్దేశిత లక్ష్యాలను సాధిద్దాం



క్యాంటీన్‌లో అల్పాహారం చేస్తున్న సింగరేణి సీఎండీ, ఇతర ఉన్నతాధికారులు

సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం

మణుగూరు/రుద్రంపూర్ (సింగరేణి), ఆగస్టు 16: సింగరేణి కాలరీస్ కంపెనీకి ఈ వార్షిక సంవత్సరంలో ఉన్న లక్ష్యాలను సమష్టి కృషితో సాధిద్దామని సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.బలరాం అన్నారు. శుక్రవారం అధికారిక పర్యటనలో భాగంగా డైరెక్టర్ పీపీ జీ వెంకటేశ్వరరెడ్డి, ఏరియా జీఎం దుర్గం రామచందర్‌తో కలిసి మణుగూరు ఏరియాలో పర్యటించారు. బంగ్లాస్ ఏరియాలో తొలుత మొక్కలు నాటారు. పీకే ఓసీ కొత్త సైట్ ఆఫీసు, క్యాంటీన్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2023-24 వార్షిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత, రవాణాలో 70 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సాధించామన్నారు. ప్రస్తుతం కోల్ ఇండియాకు సింగరేణికి పోటీ నెలకొందన్నారు. దీనిని ఎదుర్కోనేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కొత్త బొగ్గు బ్లాక్‌లను పొందేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థ తరుపున ఇప్పటికే 235 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని ముందుందు 1000 మెగావాట్లకు పెంచే ఆలోచన ఉన్నట్టు తెలిపారు. కోల్ ఇండియాలో రూ.1000కే ఓ టన్ను ఉత్పత్తి వ్యయం కాగా సింగరేణిలో రూ.4000 వ్యయం అవుతోందని తెలిపారు. లాభాల వాటా, దీపావళి బోనస్, ఆర్థిక ప్రయోజనాలపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి వారి ఆదేశాల మేరకు సకాలంలోనే బోనస్‌లు అందించడం జరుగుందన్నారు. అనంతరం ఏరియాలో పీవీ కాలనీలోని సింగరేణి పాఠశాలను ఆయన సందర్శించారు. కరస్పాండెంట్ డీజీఎం పర్సనల్ రమేష్‌తో, హెచ్ఎంలతో మాట్లాడారు. గతేడాది పదో తరగతిలో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాదించడం పట్ల అభినందనలు తెలిపారు. వచ్చే ఏడాది నుంచి సీబీఎస్ఈ సిలబస్ ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏజీఎం సివిల్ డి వెంకటేశ్వర్లు, పీకేఓసీ పివో లక్ష్మిపతి గౌడ్ , కొండాపురం యుజీ మైన్ ఏజెంట్ పి వీరభద్రరావు, ఎస్ఓటూ జీఎం డి శ్యాంసుందర్, ఏరియా ఇంజనీర్ ఆర్ శ్రీనివాస్, డిజీఎం రమేష్, ప్రాజెక్టు మేనేజర్ డి రాంబాబు, ఇతర అధికారులు వీరభద్రుడు, సురేష్, నాయకులు రాంగోపాల్, కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను మెరుగుపర్చేందుకు సింగరేణి చర్యలు..

విద్యావ్యవస్థను మెరుగుపర్చడమే లక్ష్యంగా సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకుంటుందని సీఎండీ బలరాం తెలిపారు. శుక్రవారం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆంగ్ల ప్రయోగశాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే ఆంగ్లంపై పట్టు సాధించాలన్నారు. విద్యాభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేస్తుందన్నారు. మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

క్రీడారంగాన్ని మరింత ప్రోత్సహిస్తాం

క్రీడారంగ అభివృద్ధికి సింగరేణి యాజమాన్యం కట్టుబడి ఉందని సీఎండీ తెలిపారు. క్రీడల ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. శుక్రవారం ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో రూ. 38లక్షల వ్యయంతో నిర్మించిన సింథటిక్ టెన్నీస్‌కోర్టును ప్రారంభించారు. సింగరేణి యాజమాన్యం అన్ని ఏరియాల్లో క్రీడామైదానాలను అభివృద్ధిపర్చేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు ఎన్‌వీకే.శ్రీనివాస్, జీ వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణరావు, జీఎంలు సుభాని, సూర్యనారాయణ, మనోహర్, వెంకటరమణ, దామోదర్‌రావు, సుబ్బారావు, డీజీఎంలు రాజశేఖర్, రాజీవ్‌కుమార్, పర్సనల్ మేనేజర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సింగరేణి ప్రధాన కార్యాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఐటీ ఈఆర్‌పీ గదులను ప్రారంభించారు.

రైతుసభ చిరస్థాయిగా నిలిచిపోతుంది

» వైరా సభ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, ఆగస్టు 16: వైరాలో గురువారం నిర్వహించిన బహిరంగ సభ చిరస్థాయిగా నిలిచిపోతుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్న సాగుకు జీవం... రైతుకు ఊతం రైతు బహిరంగ సభకు అంచనాలకు మించి రైతులు, అన్నివర్గాల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారని వారందరికీ వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. వైరాలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొని ఉమ్మడి ఖమ్మంజిల్లాకే కాకుండా వైరా నియోజకవర్గంలో సాగునీటి సమస్య పరిష్కారానికి భరోసా కల్పించారని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలోని రైతాంగానికి మూడోవిడతలో రూ.రెండులక్షల రుణమాఫీ అమలుచేసి వైరా వేదికగా ఒక చరిత్ర సృష్టించారని వ్యాఖ్యానించారు. వైరా మునిసిపాలిటీ సహా నియోజకవర్గంలోని అన్ని సమస్యలను సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లానని, వారు వైరా అభివృద్ధికి స్పష్టమైన భరోసా ఇచ్చారని ఇది తనకు ఒక వరమని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. సీతారామ ప్రధాన కాల్వ నుంచి రాజీవ్ లింక్ కెనాల్ నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు పాదాభివందనాలు అని పేర్కొన్నారు. వైరాలో సభ విజయవంతం కోసం వారంరోజులపాటు రాత్రింబవళ్లు పనిచేసిన అన్ని ప్రభుత్వశాఖల అధికారులకు, వైరా నియోజకవర్గంలోని అన్నిమండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్నప్పటికీ ఈ రైతు సదస్సును విజయవంతం చేసేందుకు ఉత్సాహంగా తరలివచ్చిన మహిళలు, రైతులు, అన్నివర్గాల ప్రజలకు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, నాయకులు కట్ల రంగారావు, సంతోష్, సూరంపల్లి రామారావు, పణితి సైదులు, పమ్మి అశోక్, ధార్న రాజశేఖర్, మచ్చా బుజ్జి పాల్గొన్నారు.



జక్కంపూడి దంపతుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

జక్కంపూడి కుటుంబానికి ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ

తల్లాడ, ఆగస్టు 16: తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో ఇటీవల మృతిచెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జక్కంపూడి కృష్ణమూర్తి, ప్రేమలత దంపతులకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి, ప్రేమలత దంపతుల సేవలను వారు కొనియాడారు. వారి కుమారులు జక్కంపూడి కిషోర్, రాములను పరామర్శించి మనోధైర్యాన్ని నింపారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, మండల కాంగ్రెస్ నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వర్లు, గణేశుల రవి, దీవెల కృష్ణయ్య, ఎర్రి నర్సింహారావు, దుండేటి కేశవరెడ్డి పాల్గొన్నారు.

పోస్టాఫీసులో నిధుల దుర్వినియోగంపై విచారణ

వైరా, ఆగస్టు 16: మండలంలోని గొల్లపూడి బ్రాంచ్ పోస్టాఫీసులో చిన్నమొత్తాల పొదుపు (ఆర్‌డీ)ఖాతాల్లోని నిధులు పక్కదారి పట్టిన వ్యవహారంపై సంబంధిత అధికారులు మూడు రోజులుగా విచారణ నిర్వహిస్తున్నారు. ఈ పోస్టాఫీసులో లక్షలాది రూపాయల నిధులు పక్కదారి పట్టాయని అధికారులు భావిస్తున్నారు. బ్రాంచ్ పోస్టుమాస్టర్ శ్రీనివాసరావు మరో ప్రైవేట్ వ్యక్తికి కొన్ని సందర్భాల్లో విధులు అప్పగించిన నేపథ్యంలో ఇదే అదనుగా భావించి సదరు ప్రైవేట్ వ్యక్తి నిధులను కాజేశాడనే ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. వాస్తవా నికి ఖాతాదారులు చెల్లించిన సొమ్మును మెయిన్ పోస్టల్ బ్రాంచ్‌లో ఉన్న ఖాతాదారుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. అయితే ఖాతాదారులు చెల్లించిన నగదు మొత్తాన్ని పాస్‌పుస్తకాల్లో నమోదు చేసిన సదరు ప్రైవేట్ వ్యక్తి మెయిన్ పోస్టాఫీసు ఖాతాల్లో జమచేయకుండా కాజేశారని అధికారుల విచారణలో తేలింది. ఖాతాదారుల్లో 30 శాతం మందికే పాస్‌పుస్తకాలు మంజూరు చేసి ఇంకా ఎక్కువమందికి పాస్‌పుస్తకాలు ఇవ్వని విషయం బయటపడింది. దాదాపు 50మంది ఖాతాదారుల సొమ్మును కాజేశారని విచారణలో బయటపడినట్టు సమాచారం. ఈ విషయం వెలుగులోకి రావడంతో పోస్టల్ శాఖ జిల్లా అధికారులు మధిర పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావును విచారణ చేయాలని ఆదేశించారు. ఈ పోస్టాఫీసులో 600 ఆర్‌డీ ఖాతాలు, 10 సేవింగ్స్ ఖాతాలున్నాయి. వీటన్నింటిపై ఖాతాదారులంతా పోస్టాఫీసులోని తమ ఖాతాల్లో జమచేసిన సొమ్ము భద్రంగా ఉందా లేదా అనే దానిపై సరిచూసుకోవాలని గ్రామంలో శనివారం టమకా వేయిస్తామని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు తెలిపారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి శరత్

భద్రాచలం, ఆగస్టు 16: ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, కళాశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు మెనూ ప్రకారం సమయానుకూలంగా పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి శరత్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఎస్సీ గురుకులం కార్యదర్శి అలుగు వర్షిని, ఎస్టీ గురుకులం కార్యదర్శి సీతారామ లక్ష్మి, అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, విద్యాశాఖ డీడీ చందనతో కలిసి గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల నిర్వహణ తీరుపై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో, వసతి గృహాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని మెనూ తప్పనిసరిగా పాటించాలన్నారు. వంట గదులు, శుభ్రంగా ఉంచుకోవాలని, వంట చేసే సిబ్బంది పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలం నడుస్తున్నందున విద్యార్థుల ఆరోగ్యపరమైన అంశాలపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో బి.రాహుల్, గురుకులం ఆర్సీవో నాగార్జునరావు, ఏటీడీవో అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఈ సారైనా దక్కేనా?

(5వ పేజీ తరువాయి)

తీసుకెళ్లారు. దీంతో ఖమ్మంజిల్లా నేతల ఎంపిక విషయంలో అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తోంది. రెండో విడత జాబితాలో ఉమ్మడి ఖమ్మంజిల్లా నుంచి పేర్లు ఉంటాయా లేదా అన్నది అధిష్ఠానం నుంచి స్పష్టత రావడం లేదు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రధానంగా ఉమ్మడిఖమ్మం, ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ , వరంగల్ జిల్లాలే కీలకంగా నిలిచాయి. ఇక్కడ అత్యధికంగా కాంగ్రెస్ అసెంబ్లీ స్థానాలు గెలవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఈ జిల్లాలకు నామినేటెడ్ పదవుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిందేనంటూ కొందరు అధిష్టానానికి వివరించారు. అయితే జిల్లాలో ముగ్గురు మంత్రులు నామినేటెడ్ పదవులకు అభ్యర్థుల ఎంపికలో ఏకాభిప్రాయానికి రాకపోతుండటం, పైగా ఎవరికి వారు సిఫార్సులు చేస్తుండడంతో ఆశావహుల్లో అయోమయం నెలకొంది. మంత్రులు, ఎంపీల వెంట తిరుగుతున్న ఆశాపరుల్లో కొంత అసంతృప్తి కూడా గూడుకట్టుకుంటుంది. నాయకులను నమ్మి సుదీర్ఘకాలంగా తిరుగుతున్నామని నామినేటెడ్ పదవుల విషయంలో ఉమ్మడిగా చర్చించకుండా రాష్ట్రస్థాయిలో ఎవరికి వారు సిఫార్సులు చేసుకుని పదవులు ఇప్పించుకుంటున్నారని, సిఫార్సులు లేని వారి పరిస్థితి ఏమిటంటూ కొందరు సీనియర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెండో విడత జాబితా విడుదలైతే కొందరు బహిరంగంగానే గళం విప్పే అవకాశం కనిపిస్తుంది. జిల్లాలో కీలకమైన భద్రాచలం దేవస్థానం బోర్డు వంటి చైర్మన్ పదవులను భర్తీ చేయాల్సి వుంది. నామినేటెడ్ పదవులు నియమిస్తే చాలా మంది కేడర్‌కు పదవులు దక్కడం ద్వారా వారిలో గూడు కట్టుకున్న అసంతృప్తి తొలిగే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే కొందరు నేతలు పైకి అంతా బాగుందని చెబుతున్నా, పార్టీలో తమకు గుర్తింపు ఇవ్వడంలేదని, మంత్రులను కలవడం కూడా కష్టంగా ఉంటుందన్న ఆవేదన వినిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రులను, ఎంపీలను నమ్ముకున్నవారికి పదవులు రాకపోతే అసమ్మతి గళాలు వినిపించే అవకాశం కనిపిస్తోంది.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● **ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



రేషన్ కార్డులివ్వాలని భట్టిని కోరుతున్న కూలీలు

చింతకాని, ఆగస్టు 16: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చింతకాని, ముదిగొండ జోనల్ ఇన్‌చార్జిలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో శుక్రవారం రెండు మండలాల జోనల్ ఇన్‌చార్జి బాధ్యులతో భట్టి సమావేశమయ్యారు. నాయకులు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా కృషి చేయాలన్నారు. యువజన కాంగ్రెస్ బలోపేతంపై చర్చించారు. హైదరాబాద్ వెళ్లే మార్గంలో మత్కేపల్లి నామవరం గ్రామ సమీపంలో మున్నేటి బ్రిడ్జి వద్ద కారు నిలిపి వ్యవసాయ కూలీలతో మాట్లాడారు. తమకు రేషన్‌కార్డులు ఇవ్వాలని మహిళా కూలీలు భట్టిని కోరారు. ముదిగొండ మండలం వల్లాపురం గ్రామానికి చెందిన తాటికొండ రమేష్ బ్రిడ్జి రోడ్ నుంచి మున్నేటిలోకి అప్రోచ్‌రోడ్ కావాలని భట్టిని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన గోపి, మడిపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, బందెల నాగార్జున, తోటకూరి ప్రగతి పాల్గొన్నారు.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

ఖమ్మం మార్కెట్ ఆగస్టు 16: నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు శనివారం నుంచి ఈనెల 19 వరకు వరుసగా మూడు రోజులు సెలవులు ఉన్నట్లు మార్కెట్ సెక్రటరీ ప్రవీణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 17,18 శని, ఆదివారాలు వారాంతపు సెలవులు కాగా 19 సోమవారం రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని సెలవు ఉన్నట్టు తెలిపారు. 20 మంగళవారం నుంచి మార్కెట్‌లో క్రయ విక్రయాలు యథావిధిగా జరుగుతాయని తెలిపారు.

30 వరకు పరీక్ష ఫీజు చెల్లించుటకు గడువు

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 16: 2024 అక్టోబరులో నిర్వహించే సార్వత్రిక పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లించుటకు ఈ నెల 22 నుంచి 30వ తేదీలోగా చెల్లించుటకు గడువు ఉందని డీఈవో సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. పదోతరగతి థియరీ సబ్జెక్టుకు రూ.100, ప్రాక్టికల్ సబ్జెక్టుకు రూ. 100, ఇంటర్ థియ రీకి, ప్రాక్టికల్‌కు ఒక్కో జబ్జెక్టుకు రూ.150ల చొప్పున చెల్లిం చాలని తెలిపారు. ఒక్కో సబ్జెక్టుకు రూ.25 అపరా ధ రుసుంలో సెప్టెంబరు 4 వరకు, రూ. 50ల అపరాధ రుసుంతో సెప్టెంబరు 9 వరకు చెల్లించవచ్చునని తెలిపారు.

కానిస్టేబుల్ ఆత్మహత్య

చర్ల, అగస్టు 16: తుపాకీతో కాల్చుకుని ఓ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో శుక్రవారం జరిగింది. జిల్లాలోని భైరాంగఢ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సోనూ (40)అనే కానిస్టేబుల్ ఎప్పటి లానే విధులకు హాజరయ్యాడు. అనంతరం సర్వీస్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తోటి పోలీసులు గుర్తించి వెంటనే స్థానిక వైద్యశాలకు తరలించారు. అప్పటికే కానిస్టేబుల్ సోనూ మృతి చెందాడు. మృతికి గల కారణగాలు తెలియాల్సి ఉంది.

పూవర్తికి ఉప ముఖ్యమంత్రి విజయశర్మ

మావోయిస్టు ఇలాకా అయిన పూవర్తి గ్రామానికి ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయశర్మ శుక్రవారం వెళ్లారు. కొద్ది రోజుల క్రితం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను మావోయిస్టులు హత్య చేశారు. దీంతో గ్రామానికి వెళ్లిన ఉపముఖ్యమంత్రి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. అలాగే గ్రామానికి రోడ్లు, ప్రభుత్వ సదుపాయాలు కల్పిస్తామని గ్రామస్థులకు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



జిల్లా జనరల్ ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యకుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్

ఖమ్మం కలెక్టరేట్ ఆగస్టు 16: 'గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్య పర చాలి... సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి.. డ్రై డే కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలి..' అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సీజనల్ వ్యాధులు, డెంగ్యూ నియంత్రణ, వైద్య ఆరోగ్య శాఖ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పట్టణ ప్రాంతాలతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లోను డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయని, డెంగ్యూ నియంత్రణ పై వైద్య ఆరోగ్య శాఖతోపాటు స్థానిక సంస్థలు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రై డే కార్యక్రమాల వల్ల దోమల వృద్ధిని అరికట్ట వచ్చన్నారు. పరీక్షలు పెంచాలని, పాజిటివ్ వచ్చినచో, సంబంధికులు, చుట్టుపక్కల నమూనాలు సేకరించడం, నియంత్రణ చర్యలు చేపట్టడం చేయాలన్నారు. ఫీవర్ సర్వే క్రమంతప్పకుండా చేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులతో బృందాలను ఏర్పాటుచేసి, గ్రామాల్లో, వార్డుల్లో ఇంటింటికి తిరగడం, ప్రజల్లో అవగాహన కల్పించడం చేయాలన్నారు. నీరు నిల్వ లేకుండా చూడడం, యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టడం చేయాలన్నారు. వచ్చే 2-3 నెలలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

జిల్లా ప్రధాన ఆసుపత్రిలో డెంగ్యూ తో బాధపడేవారికి ఒక ప్రత్యేక వార్డు ఏర్పాటుచేసి, చికిత్స అందించాలన్నారు. వార్డులో 24 గంటలు వైద్యాధికారి అందుబాటులో ఉండి, ప్రత్యేక శ్రద్ధ తీసుకొనేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలోసేకరించే నమూనాలు టి హబ్ కు, ప్రయివేట్ ఆసుపత్రుల నమూనాలు ఐడీఎస్పి ల్యాబ్ లకు పరీక్షలు చేయించాలని అన్నారు. ప్లేట్లెట్ కౌంట్ పై ప్రజల్లో భయం పోగొట్టి తగు చికిత్స అందించాలని అన్నారు. ప్లేట్లెట్, బ్లడ్ సరిపోవునంతగా అందుబాటులో ఉండేట్లు చర్యలు తీసుకోవాలని అన్నారు.

అంతకుముందు కమిషనర్ కూసుమంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో రెఫరల్, అంబులెన్స్, డెలివరీ రిజిష్టర్లను తనిఖీ చేశారు. ల్యాబరేటరీ పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. డెలివరీలు పెంచాలని, గర్భిణులకు రెగ్యులర్ చెకప్ అయ్యేలా చూడాలని, మెరుగైనసేవలు అందించి నమ్మకం పెంచాలని అన్నారు. అలాగే జిల్లా ప్రధాన ఆసుపత్రిని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ కలెక్టర్‌తో కలిసి తనిఖీ చేశారు. రేడియాలజీ కేంద్రాన్ని పరిశీలించి, ఎంతమంది టెక్నీషియన్లు ఉన్నది, ఎన్ని పరీక్షలు చేపడుతున్నది అడిగి తెలుసుకున్నారు. మామోగ్రఫీ చేపడుతున్నది, ఎన్ని కేసులు చేసింది అడిగారు. పరీక్షల రిజిష్టర్ పరిశీలించారు. టీ హబ్ కేంద్రాన్ని పరిశీలించారు. డెంగ్యూ పరీక్షల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ, ప్రతి శుక్రవారం జిల్లాలో డ్రై డే ను పటిష్టంగా చేపడుతున్నట్లు తెలిపారు. స్లమ్ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం, వైద్య శిబిరాలు నిర్వహించడం చేయాలన్నారు. ప్రజల్లో సీజనల్ వ్యాధులపై అవగాహనకు విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, శిక్షణ సహాయ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, ఇన్‌చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఆర్‌వో సన్యాసయ్య, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి. మాలతి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, డీసీహెచ్ఎస్ రాజశేఖర్, డీటీసీవో సుబ్బారావు, ఇన్‌చార్జ్ జెడ్పీ సీఈవో నాగలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సైదులు, సీతారాం, ప్రోగ్రామ్ అధికారులు చందునాయక్, రామకృష్ణ, మెడికల్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ బి. కిరణ్ కుమార్, ఆర్ఎంఓ రాంబాబు, కళావతి తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు పవిత్రారోపణం

» సహస్రధారతో ప్రత్యేక స్నపనం

» దర్శించుకున్న పలువురు ప్రముఖులు



రామాలయంలో కుటుంబ సభ్యులతో హైకోర్టు న్యాయమూర్తులు

భద్రాచలం, ఆగస్టు 16: భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం భద్రాద్రి రామయ్యకు పవిత్రారోపణం గావించారు. ముందుగా స్వామి వారికి వేద విన్నపాలు చేసారు. ఈ క్రమంలో ఉత్సవ మూర్తులకు సహస్రధారతో ప్రత్యేక స్నపనం నిర్వహించారు. హవనం అనంతరం పవిత్రాలను ప్రధాన ఆలయం నుంచి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి ముందుగా మూలవరులకు ధరింపజేసి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీతాయారు అమ్మవారు, ఆంజనేయస్వామి, భక్తరామదాసు, గోదాదేవి ఆలయాలకు, ఉత్సవ మూర్తులకు వేసిన తరువాత చివరగా ఆలయానికి, ధ్వజస్తంభానికి, బలిపీఠానికి పవిత్రాలను ధరింపజేశారు. అలాగే అర్చకులు సైతం పవిత్రాలను ధరించారు.

ప్రతి ఏటా ఆలయంలో సకల దోష నివారణార్థం పవిత్రోత్సవాలను నిర్వహించడం సంప్రదాయం. అందులో భాగంగా బుధవారం పవిత్రోత్సవాలకు అంకురారోపణం గావించారు. ఈనెల 15 నుంచి 19 వరకు ఆలయంలో ప్రతి రోజు నిర్వహించే నిత్య కల్యాణాలను నిలిపివేశారు. శని, ఆదివారాల్లో నిత్య హోమాలు నిర్వహించి వేదపారాయణం చేయనుండగా 19న పూర్ణాహుతి, పవిత్రాల ఉద్వాసన, మహాకుంభ ప్రోక్షణ గావించనున్నారు. ఈ కార్యక్రమాల్లో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవో భవానీ రామకృష్ణారావు, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, అమరవాది మురళీకృష్ణమాచార్యులు, పాల్గొన్నారు.

దర్శించుకున్న ప్రముఖులు

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కె.శరత్, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి ఎం.లక్ష్మణ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వారికి వేద ఆశీర్వచనం నిర్వహించారు. ఈ సమయంలో దేవస్థానం తరపున శాలువ, స్వామి వారి ప్రసాదం వారికి అందజేశారు. అలాగే మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావులు రామయ్యను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు

● రూ.1.40 లక్షలు దారిమళ్లినట్టు గుర్తింపు
● ఇద్దరు సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు


కార్యదర్శులను ప్రశ్నిస్తున్న అధికారులు

చంద్రుగొండ, ఆగస్టు 16: మండలంలో గత సంవత్సరం జరిగిన ఉపాధి హామీ పనులలో కొన్ని అక్రమాలు జరిగినట్లు శుక్రవారం చంద్రుగొండ మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులు గుర్తించారు. మండలంలో 14 పంచాయతీల్లో 392 పనులకు గాను రూ.3.51 కోట్లు ఖర్చు అయ్యాయి. ఈ పనులను గత వారం రోజుల పాటు తనిఖీ బృందాలు పరిశీలించి నివేదిక తయారు చేశారు. కాగా ఈ పనులపై డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ రవికుమార్ ఆధ్వర్యంలో తనిఖీ వేదిక జరిగిన విచారణలో రూ.1.40 లక్షలు అక్రమాలు జరిగినట్లు తేలింది. ఈ నిధులను సంబంధిత సిబ్బంది తిరిగి చెల్లించాలని అడిషనల్ పీడీ ఆదేశించారు. దీంతో పాటు ఆరు పనులపై క్వాలిటీ కంట్రోల్ అధికారులు విచారణ చేయాలని క్వాలిటీ అధికారులకు సూచించారు. దీంతో పాటు పలు అక్రమాకు పాల్పడ బెండాలపాడు, మంగయ్యబంజర్ ఫీల్డు అసిస్టెంట్‌లపై కేసులు నమోదు చేయాలని పోలీసు స్టేషన్‌లో అడిషనల్ పీడీ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అంబుట్స్ అధికారి నాగప్రసాద్, క్వాలిటీ కంట్రోల్ అధికారి రమణారావు, ఎంపీడీవో అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే రోగాలు తగ్గుతాయా?

- ఆసుపత్రి ఆవరణలోనే చెత్త..
- రోగుల పరిస్థితి ఎట్లా?
- పేరుకుపోయిన వ్యర్థాలు
- దుర్గంధ భరితంగా పరిసరాలు



ఆస్పత్రి ఆవరణంలో వ్యర్థాలన్నీ ఇలా.. మాతాశిశు సంరక్షణ కేంద్రం మురుగు ముందుకు కదలక

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 16: అనారోగ్యంతో బాధపడే వాళ్లే ఆసుపత్రికి వస్తారు.. అక్కడి పరిస్థితులు రోగులు త్వరగా కోలుకునేలా ఉండాలి.. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకత తెలియజెప్పేలా ఉండాలి.... కానీ ఖమ్మం జనరల్ ఆసుపత్రిలో పరిస్థితులు ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. రోజుల తరబడిగా మెడికల్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వస్తోంది. రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. దోమలు, ఈగల సమస్య కూడా తీవ్రమైంది. ఖమ్మం ఆస్పత్రిని ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెలుగులోకి వచ్చిన అంశాలు ఇలా..!

● ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు, వైద్యం కోసం ఉపయోగించిన మెడికల్ వ్యర్థాలు, రోగులు పడేసిన ఆహార పదార్థాలు తదితరాలను పోస్టుమార్టం చేసే ఖాళీ ప్రదేశంలో చెత్త కుండీల్లో వేస్తారు. ఆ చెత్తను పురపాలిక వాహనంతో డంపింగ్ యార్డుకు తరలిస్తారు. రోజూ చేపట్టాల్సిన ఈ ప్రక్రియ సాఫీగా సాగడం లేదు. ఇందుకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. మునిసిపల్ వాహనం వస్తోందో రాదో తెలియని పరిస్థితి. సెలవు రోజుల్లో ఇక పట్టించుకునే నాథుడే లేరు. దీంతో వ్యర్థాలన్నీ కంపుకొడుతు అటువైపుగా వెళ్లాలంటేనే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి. చెత్తను తరలించేందుకు ఆసుపత్రికి ప్రత్యేకంగా వాహనం లేకపో వడంతో పూర్తిగా మునిసిపాలిటీపైనే ఆధార పడాల్సి వస్తోంది.

పారిశుధ్య చర్యలపై నిలువెల్లా నిర్లక్ష్యమే..!

ఆసుపత్రిలో పారిశుధ్య పనులు కూడా సరిగ్గా చేపట్టడం లేదు. ఆసుపత్రిలోని వ్యర్థాలను తరలించి ఒక చోట వేయాల్సిన కార్మికులు ఇష్టం వచ్చినట్లు పడేసి వెళ్తున్నారు. ఫలితంగా పోస్టుమార్టం ప్రాంతానికి వెళ్లే దారి రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. భరించలేని దుర్వాసన వస్తోంది. పారిశుధ్య చర్యలు చేపట్టే కార్మికులను పర్యవేక్షించాల్సిన నిర్వాహకులు నిర్లక్ష్యం వల్లనే ఆసుపత్రి పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. వార్డుల్లోనూ, మరుగుదొడ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది. వీటిని పట్టించుకోవాల్సిన అధికారులు, గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. వామ్మో ప్రభుత్వ ఆస్పత్రా అనే పరిస్థితికి రోగులను తీసుకొస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

డ్రెయినేజీ సమస్యతో...!

మాతాశిశు సంరక్షణ కేంద్రం సమీపంలో డ్రెయిన్ వలన మురుగు నీరు నిలిచిపోయి దోమలకు ఆవాలంగా మారిపోయింది. మురుగు నీరు ముందుకు కదలక పోవడంతో రోజుల తరబడి నిలిచిపోతోంది. ఫలితంగా నీళ్లు కంపుకొడుతున్నాయి. దీంతో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీని కోసం ప్రభుత్వం రూ.35 లక్షలతో డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణం కోసం నిధులు కేటాయించినట్లు చెపుతున్నా పనులను మాత్రం ప్రారంభించలేదు. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు ఆరోగ్యం మాట అటుంచితే అనారోగ్యాన్ని మాత్రం పంచుతున్నాయి. పారిశుధ్య చర్యలు చేపట్టే కార్మికులను పర్యవేక్షించాల్సిన ఏజెన్సీల నిర్వాహకులు నిర్లక్ష్యం కారణంగానే ఆస్పత్రి పరిసరాలు అధ్వానంగా మారుతున్నయన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

దృష్టి సారించాం..

డాక్టర్ కిరణ్‌కుమార్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్



పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. పారిశుధ్య ఏజెన్సీతో కొన్ని సమస్యలున్న మాట వాస్తవమే వాటిని త్వర లో పరిష్కరిస్తాం. డ్రెయినేజీ కోసం కూడా నిధులు వచ్చాయి. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

చెస్ పోటీల్లో సత్తా చాటిన
నాగసాయి శశాంత్


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

చుంచుపల్లి, ఆగస్టు16: అంతర్జాతీయ చదరంగ పోటీలలో చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ ప్రాంతానికి చెందిన నిడమనూరి నాగసాయిశశాంత్ రాణించాడు. ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్జాతీయ అండర్ - 13 విభాగంలో చదరంగ పోటీల రేటింగ్స్‌ను ప్రకటించారు. ఈ ఫలితాలలో నాగసాయిశశాంత్ 1456 పాయింట్స్ రేటింగ్స్‌తో తన దైన శైలిలో గేమ్ ప్లాన్‌తో సత్తా చాటాడు. నాగసాయిశశాంత్ పాల్వంచలోని నవభారత్ పబ్లిక్ స్కూల్ నందు 8వ తరగతి విద్యను అభ్యసిస్తున్నాడు. నాగసాయిశశాంత్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవి.రెడ్డి శుక్రవారం అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో మరెన్నో వేదికల్లో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు బాలకృష్ణ, నాగలక్ష్మీ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్ల సందడి


జేఎన్‌టీయూ కళాశాలలో ధృవపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 16: మూడు దశలో ఇంజనీరింగ్‌లో సీట్లు వచ్చిన విద్యార్థులు శ్రావణ శుక్రవారం మంచి రోజు కావటంతో ఇంజనీరింగ్ కళాశాలలో అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఆసక్తి చూపటంతో ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని పలు ఇంజనీరింగ్ కళాశాలలు విద్యార్థులు వారి తల్లితండ్రులతో కళకళలాడాయి. శనివారంతో మూడో దశ కౌన్సిలింగ్‌కు ఆఖరి రోజు కావటంతో మరికొంత మంది విద్యార్థులు కళాశాలలకు అడ్మిషన్లు పొందేందుకు రానున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలోని కళాశాలల్లో ఈ ఏడాది మొదటి, రెండో దశల్లోనే 70 శాతానికి పైగా సీట్లు భర్తీ అయ్యాయి. దాంతో గత కొన్నేళ్లుగా డీలాపడిన ఇంజనీరింగ్ కళాశాలలు మళ్లీ కళను సంతరించుకోనున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఒకప్పుడు 20కి పైగా కళాశాలలతో కళకళలాడేవి. కాలక్రమేణా ఆయా కళాశాలల్లో విద్యార్థులు తగ్గడంతో సంబంధిత యాజ మాన్యాలు సైతం బోధనపై సరైనరీతిలో దృష్టి సారించలేదు. ఫలితంగా పదుల సంఖ్యలో ఇంజనీరింగ్ కళాశాలలు మూతపడి గురుకులాలుగా మారాయి. ఈ ఏడాది గతానికి భిన్నంగా సీట్లు నిండాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 13 కళాశాలల్లో అన్నీ కోర్సులు కలిపి 3,938 సీట్లు ఉండగా.. ఒకటవ, రెండవ విడత సీట్ల కేటాయింపులు ముగిసే సమయానికే 2,852 సీట్లు భర్తీ అయ్యాయి. వాటిల్లో అత్యధికంగా కంప్యూటర్ కోర్సులకే మొగ్గు చూపినట్టుగా స్పష్టమవుతోంది. ఉమ్మడి జిల్లాలో సివిల్, మెకానికల్, మైనింగ్ సీట్లు తక్కువగా ఉన్నప్పటికీ అవి అంతంతమాత్రంగానే భర్తీ అయ్యాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూడో దశ సీట్లకు సంబందించి శనివారం పూర్తి వివరాలు తెలియనున్నాయి.

పాలేరు జేఎన్టీయూలో..

గతేడాది ప్రారంభించిన పాలేరు జేఎన్టీయూ యూనివర్సిటీ కళాశాలలో రెండో దశ కౌన్సెలింగ్ పూర్తయ్యేసరికి అన్నీ బ్రాంచిలలో కలిపి 100 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 330 సీట్లకుగాను 230 సీట్లు కేటాయింపులు పూర్తయ్యాయి. కాగా మూడో దశ కౌన్సిలింగ్‌లో శుక్రవారం రోజు అన్ని గ్రూపులకు సంభందించి 102 మంది రిపోటింగ్ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి రమేష్ తెలిపారు. శనివారంతో కౌన్సిలింగ్ పూర్తికానున్నదని రేపు కూడ విద్యార్థులు రిపోర్ట్ చేస్తారని తెలిపారు. కళాశాలకు కెటాయించిన బిల్డింగ్‌ను పూర్తిస్థాయిలో ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం అనుమతించిందని అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉందని తెలిపారు.

జమలాపురంలో ముగిసిన పవిత్రోత్సవాలు


శ్రీవారి పుష్కరిణి వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం, ఆగస్టు 16: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆల యంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న ఆలయ వార్షి కోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. దీనిలో భాగంగా యాగశాలలో అవాహిత సర్వదేవతా హోమాలకు వైభవం గా పూర్ణాహుతి, నిర్వహించారు. ప్రాతఃకాల అర్చనలు, నిత్యపూజలు, అనుష్టానములు అనంతరం పవిత్ర విసర్జన గావించారు. అనంతరం శాస్త్రోక్తంగా శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు. ఆలయ సాంప్ర దాయంతో చక్రస్నానంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. శ్రీ అలివేలు మంగ, పద్మావతి అలయాల్లో శ్రావణ శుక్ర వారం, వరలక్ష్మీవ్రతం సందర్భంగా మహిళలు సామూమి క కుంకుమార్చనలు లలితా సహస్రనామం గావించారు.

నేడు శాకాంబరి ఆలంకరణ

వార్షిక పవిత్రోత్సవాల అనంతరం ప్రతి ఏటా ఆలయంలో శ్రీదేవి, భూదేవి లకు శాకంబరి అలంకారం చేయడం ఆనవాయిగా వస్తుంది. దీనితో శనివారంశాఖంబరి దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. భక్తులు సమర్పించే కూరగయాలు, పండ్లు, ఆకుకూరలతో శాఖంబరి అలంకారం నిర్వహిస్తారు. ఈకార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి ,ఆలయ సూపరింటెండెటంగ్ విజయకుమారి ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, ముఖ్యఅర్చకుడు మురళీమోహనశర్మ, అర్చకులు రాజీవ్‌శర్మ, దేవస్థాన సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీతాయారు అమ్మవారికి విశేష స్నపనం

- రామాలయంలో సామూహిక కుంకుమార్చన


పూజలు నిర్వహిస్తున్న వైదిక సిబ్బంది

భద్రాచలం, ఆగస్టు 16: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో శ్రావణ మాసంలో రెండో శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా లక్ష్మీతాయారమ్మ వారికి అర్చకులు విశేష స్నపనాన్ని నిర్వహించారు. సాయంత్రం సీతారామచంద్రస్వామి కల్యాణమూర్తులను, మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య బేడా మండప వేదిక వద్దకు తీసుకొచ్చారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళ భక్తులకు పూజా సామగ్రిని దేవస్థానం అధికారులు అందజేశారు. అలాగే స్వామి వారి ప్రసాదం, అమ్మవారి రూపు, ఇతరత్రా పూజా సామాగ్రి అందజేశారు. భక్తులకు ప్రసాద వినియోగం గావించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం స్తానాచార్యులు కేఈ స్థలశాయి, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, ముఖ్య అర్చకులు పొడిచేటి రామభద్రాచార్యులు, కోటి విష్ణువర్దనాచార్యులు పాల్గొన్నారు.

జెట్టీపై గర్భిణి తరలింపు!

● చర్ల మండలంలో ఘటన
పీవో, కలెక్టర్ దృష్టి సారించాలని వినతి

చర్ల, అగస్టు 16: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని జెట్టీపై తరలించిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం రాంచంద్రాపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సన్నీ అనే గర్భిణికి నొప్పులు ప్రారంభం అయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు జెట్టీకట్టి ఆమెను కుర్నపల్లి గ్రామం వరకు సుమారు 3 కిలోమీటర్లు మోసుకుంటూ వచ్చారు. ఇదే క్రమంలో వాగు దాటేందుకు ఇబ్బంది పడ్డారు. అనంతరం కుర్నపల్లి, అక్కడి నుంచి అంబులెన్స్‌లో చర్ల మండలం సత్యనారాయణ పురం వైద్యశాలకు తరలించినట్లు తెలుస్తోంది. అక్కడ వైద్య సిబ్బంది ఆమెకు వైద్యం చేసి ప్రసవం చేశారు. ప్రస్తుతం తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. కాగా గత కొద్ది రోజుల క్రితం చర్ల మండలం భూరుగుపాడు గ్రామానికి చెందిన గర్భిణిని కూడా జెట్టీపై వైద్యం కోసం సత్యనారాయణ పురం వైద్యశాలకు తరలించారు. ఇదే క్రమంలో ఆదివాసీ మహిళ నరకయాతన అనుభవించింది. నేడు కూడా ఇదే ఆదివాసీ మహిళ తీవ్ర ఇబ్బంది పడింది. వైద్య సిబ్బంది వారిని వైద్యశాలకు తరలించడంలో అలసత్వం వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. పీవో, కలెక్టర్ చర్ల మండలంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాగా గర్భిణీని వైద్యశాలకు తీసుకొచ్చారని కానీ ఆమెను జెట్టీ మీద తీసుకొచ్చిన విషయం తమకు తెలియదని సత్యనారాయణపురం ఆసుపత్రి వైద్యురాలు దివ్య తెలిపారు.

ఖమ్మం 1వ డివిజన్ రైల్వే కాలనీలో వరస చోరీలు

- తాళాలు వేసి వెళితే అంతే...
- చిన్న వస్తువులు సైతం చోరీ

ఖమ్మం క్రైం, ఆగస్టు 16: నగర పరిదిలోని 1వ డివిజన్ కైకొండాయిగూడెం రైల్వే కాలనీలో వరస చోరిలతో ప్రజలు బెంబేలేత్తుతున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తూ ఎవ్వరూ చూడని సమయంలో గొడలు దూకి ఇళ్లను కొల్లగొడుతున్నారు. ఇంట్లో ఉన్న చిన్న వస్తువుల దగ్గర నుంచి నగదు, స్టీల్ సామాను దాకా దొరికింది దొచుకుని వెళుతున్నారు. ఆప్రాంతంలో ఎక్కువగా సామాన్యులు ఉంటుండగా ఇంట్లో ఎమి దొరకక పోయినా ఇంటి బయట ఉండే స్టీల్ నీళ్ల నల్లాలు చోరి చేస్తున్నారు. దీంతో స్థానికులు తాళం వేసి ఉర్లు వెళ్లాలంటే బయపడుతున్నారు.

పగలు రాత్రి తేడా లేకుండా

నగర పరిదిలోని పాండురంగాపురానికి సమీపంలో ఉన్న రైల్వే కాలనీలో పగలైతే వరుసగా ఇళ్లలో ట్యాప్‌లు, రాత్రి అయితే కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లలో వస్తువులు చోరీలు జరుగుతున్నాయి. గుర్తు తెలియని దొంగలు చోరీలకు పాల్పడుతుండటంతో స్థానికులు ఇంట్లోని సామాన్లు కుడా బయట పెట్టకుండా దాచుకుంటున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా వరస చోరిలు జరుగుతున్న పట్టించుకునే వారే లేరు. ఇటివల కాలంలో చోరీలు ఎక్కువ అవుతుండటంతో స్థానికులు పోలీసులను ఆశ్రయించారు.

కనపడని పెట్రోలింగ్

పగలు, రాత్రి సమయాలలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన పెట్రోలింగ్ వాహనాలు ప్రస్తుతం ఎక్కడా కనపడటంలేదు. రాత్రి సమయంలో ప్రధాన రోడ్లపై సైరన్ వేస్తూ తిరుగుతున్నారే తప్ప లోపలికి ఉన్న వీదుల్లోకి పెట్రో వాహనాలు రావడంలేదని స్థానికులు అంటున్నారు. పెట్రో వాహనాలు రావడంలేదని గమనించి దొంగలు ఇష్టమెచ్చినట్టు చోరీలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పోలీసులకు పిర్యాదు

తాళాలు వేసిఉన్న ఇళ్లల్లో నీళ్ల ట్యాప్‌లు దొంగిలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు ఖానా పురంహవేలి పోలీసులకు ఫిర్యాదుచేశారు. నగరంలోని కైకొండాయిగూడెం, రైల్వేకాలని లోని గత కొద్దిరోజులుగా తాళాలు వేసిఉన్న ఇండ్లలో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లలో గుర్తుతెలియనివారు చోరీలకు పాల్పడుతున్నారని ఆ కాలనీకి చెందిన కొందరు ఖానాపురంహవేలి పోలీసుల కు ఫిర్యాదుచేశారు. అదేవిధంగా పెట్రోలింగ్ కూడా పెంచాలని ఫిర్యాదులో పేర్కొన్నట్టు కాలనీ వాసులు తెలిపారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

బూర్గంపాడు, ఆగస్టు 16: మనస్తాపంతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గౌతపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బూర్గంపాడు మండల పరిదిలోని గౌతపురం కాలనీకి చెందిన కొమ్ము సంధ్య (24)కు ఏపీలోని కుక్కునూరు మండలం వింజరం గ్రామానికి చెందిన గొడ్ల సుధాకర్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి సారపాకలో ఉంటూ జీవనం సాగిస్తున్న క్రమంలో ఏడాది క్రితం సుధాకర్ అనారోగ్యంతో మృతి చెందాడు. భర్త మృతితో మనస్తాపం చెందిన సంధ్య ఈ నెల 9న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు భద్రాచలం తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. శుక్రవారం మృతురాలి బంధువుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖమ్మం ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ అఫ్జల్ కన్నుమూత

నివాళులు అర్పించిన మాజీ వైఎస్ ఎంపీపీ, సర్పంచ్‌లు, నాయకులు


అఫ్జల్ (ఫైల్)

రఘునాథపాలెం, ఆగస్టు 16: ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అఫ్జల్(70) అనారోగ్యంతో శుక్రవారం ఆయన స్వగ్రామం రఘునాథపాలెం మండలం రాంక్యాతండాలో కన్నుమూశారు. బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడిగా మృదుస్వభావిగా అఫ్జల్‌కు నియోజకవర్గ వ్యాప్తంగా మంచి పేరు ఉంది. ఎటువంటి రాజకీయ వివాదాలకు తావు లేకుండా అన్ని పార్టీలతో మంచి సంబందాలను కొనసాగించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు అనుంగుడిగా పేరు పొందారు. కొంతకాలంగా అనారోగ్యంగా ఉన్న అఫ్జల్ మృతి చెందటంతో రాంక్యాతండాలో విషాదచాయలు అలముకున్నాయి. రాజకీయాలకు అతీతంగా నాయకులు అఫ్జల్ కుటుంబాన్ని పరామర్శించారు. తాజా మాజీ వైఎస్ ఎంపీపీ గుత్తా రవికుమార్, మాజీ ఎంపీటీసీలు జాన, సొసైటీ మాజీ అధ్యక్షులు తుమ్మలపల్లి మోహన్‌రావు, మందడపు నర్సింహారావు, మాజీ సర్పంచులు దీప్లానాయక్, రెంటాల ప్రసాద్, మాజీ మంత్రి పీఏ రవికిరణ్ అఫ్జల్ కుటుంబాన్ని పరామర్శించారు.

లారీ, బైక్ ఢీ: ఒకరు మృతి


ఘటనా స్థలంలో క్షతగాత్రులు

ముదిగొండ, ఆగస్టు 16: ఆగిఉన్న లారీని వెనుకనుంచి ద్విచక్రవాహనం ఢీకొట్టిన సంఘటనలో ఓ యువకుడు మృతిచెందగా మరో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన ముదిగొండ మండలం గోకినపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. నేలకొండపల్లి మండలం మంగాపురంతండాకు చెందిన గుగులోతు సంతోష్ (22), గుగులోతు సతీష్ ఖమ్మం నుంచి మంగాపురం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా లారీని వెనుకనుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సంతోష్, సతీష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తుండగా సంతోష్ మార్గమధ్యలో మృతిచెందాడు. సతీష్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ముదిగొండ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ఖమ్మంక్రైం, ఆగస్టు 16: మహిళ మెడలో గుర్తు తెలియని వ్యక్తి బంగారు గొలుసు చోరి చేసిన సంఘటన గురువారంరాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన రాజ్యలక్ష్మి అనే మహిళ నగరంలోని వీడియోస్‌కాలనీలోని తన బంధువుల ఇంటికి వచ్చింది. నడుచుకుంటూ వెళుతున్న ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి లాక్కుని పారిపోయాడు. ఆమె కేకలు వేయగా స్థానికులు అక్కడికి వచ్చినప్పటికి అతడు దొరకలేదు. దీంతో బాదితురాలి ఖమ్మం టుటౌన్ పోలీసులకు శుక్రవారం పిర్యాదు చేసింది. పిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మ్యూజియాన్ని సందర్శించిన కలెక్టర్ జితేష్

భద్రాచలం, ఆగస్టు 16: భద్రాచలంలోని ఐటీడీఏ ఆవరణలో ఉన్న గిరిజన మ్యూజియాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ భద్రాచలానికి ఇతర రాష్ట్రాల నుంచి భక్తులతో పాటు పాపికొండలు తిలకించడానికి టూరిస్టులు అధికంగా వస్తారని అన్నారు. గిరిజన మ్యూజియంను సందర్శించేలా ఏర్పాట్లు చేయడంతో పాటు తగిన ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరసింహారావు, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి పాల్గొన్నారు.

ఎర్రకోట వేడుకల్లో తల్లాడ విద్యార్థి అజయ్‌కుమార్


పోలీసు అధికారులతో అజయ్

తల్లాడ, ఆగస్టు 16: దేశరాజధాని ఢిల్లీలోని ఎర్రకోట లో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొన్న స్వాతంత్ర్య దినోత్స వ సంబరాల్లో పాల్గొనే అరుదైన అవకాశం తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి తోట అజయ్‌కుమార్‌కు దక్కింది. గత నెలలో జరిగిన ప్రేరణ ఉత్సవంలో పాల్గొని ప్రతిభ కనపరిచి నందుకు గానూ అజయ్‌కుమార్‌కు ఎర్రకోట ప్రవేశానికి ఆహ్వానం దక్కింది. ప్రధాని నరేంద్రమోదీ తో తనకు మాట్లాడే అవకాశం దక్కిందని అజయ్‌కుమా ర్ ఆనం దం వ్యక్తం చేశాడు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో ఇంట్రాక్షన్ మీటింగ్‌లో పాల్గొన్నాడు. అరుదైన అవకాశం పొందిన అజయ్‌కుమార్‌ను కేఎస్‌ఎం విద్యాసంస్థల కరస్పాండెం ట్ కోటగిరి ప్రవీణ్ అభినం దించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మధిరటౌన్, ఆగస్టు16: కరెంటు షాక్ తో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి మధిర లో జరిగింది. విజయవాడ రోడ్డులో ఉన్న ఒక రెస్టారెంట్ లో సప్లయిర్ గా పని చెస్తున్న ఒడిషా రాష్ట్రానికి చెందిన సయ్యద్ నిజాముద్దీన్(26) రెస్టారెంట్‌లోని ఫ్రిజ్‌ను పట్టుకోగా దానికి విద్యుత్ ప్రసరణ జరిగి అక్కడికి అక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ వివరాలు తెలియరాలేదు. సంఘటన స్థలాన్ని టౌన్ ఎస్ఐ సంధ్య సందర్శించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



కలెక్టర్ హామీతో సమ్మె విరమించిన కార్మికులు

భద్రాచలం, ఆగస్టు 16: పెండింగు వేతనాలు చెల్లించాలంటూ గత నాలుగు రోజులుగా సమ్మెలో ఉన్న ఏరియా వైద్యశాల కార్మికులు శుక్రవారం సమ్మె విరమించారు. కాంట్రాక్టు కార్మికులతో చర్చలు జరిపి కలెక్టర్ హామీతో సమ్మె విరమించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముక్కంటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వారం రోజుల్లో రావాల్సిన మూడు నెలల వేతనానికిగాను ఒక నెల వేతనం శనివారం నాటికి వేస్తామని, మిగతావి కలెక్టర్ స్వయంగా వారం రోజుల్లో వేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు సంతృప్తి చెంది తాత్కాలికంగా సమ్మెను విరమించి విధుల్లో చేరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసి, డిమాండ్లు సాధించుకున్న కార్మికులను అభినందించారు.

మండల పరిషత్‌లో అధికారులేరీ..?

10నెలలుగా సూపరింటెండెంట్ కుర్చీ ఖాళీ

బదిలీల్లో నలుగురు వెళ్లినా ఒక్కరూ రాలేదు

ఎంపీడీవో ఉద్యోగ విరమణతో ఇన్‌చార్జ్ పాలన

సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియక ప్రజలు ఆవేదన

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 16: ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకం అయినా మండల పరిషత్ ద్వారానే జరగాలి. గ్యారంటీలకు కేంద్ర బిందువు మండల పరిషత్ కార్యాలయం. నిత్యం వందల మంది ఇక్కడకు వచ్చి తమ సమస్యలు చెప్పుకుని దరఖాస్తులు ఇస్తుంటారు. ఒక విధంగా చెప్పాలంటే మండలంలో ఏ సంక్షేమ కార్యక్రమం నిర్వహించాలన్నా, లబ్ధిదారుల ఎంపికలు చేపట్టాలన్నా ఎంపీడీవో కార్యాలయాలే నిలయాలు. సంక్షేమ ఫలాలకు నిలయమైన మండల పరిషత్‌కు అధికారులే లేకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే చెప్పవచ్చు. ఇప్పుడు ఆ పరిస్థితే అశ్వారావుపేట మండల పరిషత్‌లో ఉంది.

ఖాళీ కుర్చీలే దర్శనం

అశ్వారావుపేట మండల పరిషత్ కార్యాలయంలో ప్రస్తుతం పూర్తిస్థాయిలో అధికారులే లేకపోవటం, ఉన్న ఇద్దరు ముగ్గురే అన్నీ తామై చూడాల్సి వస్తోంది. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో గతనెలలో రిటైర్డ్ కావడం, తాజాగా జరిగిన బదిలీల్లో కొందరు వేరే ప్రాంతానికి వెళ్లటం, మరొకరు డిప్యుటేషన్‌పై జిల్లా కేంద్రానికి వెళ్లటం వెరసి కార్యాలయం అధికారుల్లేక బోసిపోతుంది. ప్రస్తుతం దమ్మపేట ఎంపీడీవో ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. కార్యాయల నిర్వణాధికారి(సూపరింటెండెంట్) పదినెలల క్రితం జిల్లా కేంద్రానికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. దీంతో ఆ కుర్చీ ఖాళీగానే ఉంటోంది. ఎంపీడీవో తరువాత అన్నీ కార్యక్రమాలు నిర్వహించేది ఆ అధికారే. సీనియర్ అసిస్టెంటు దమ్మపేట, దమ్మపేట సీనియర్ అసిస్టెంట్ అశ్వారావుపేటలో మ్యుచువల్‌పై పనిచేస్తున్నారు. అశ్వారావుపేట సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు చంద్రుగొండకు బదిలీ అయ్యారు. దమ్మపేట సీనియర్ అసిస్టెంట్ అశ్వారావుపేటలో విధులు నిర్వహిస్తున్నారు. టైపిస్ట్, అటెండర్ బదిలీపై వెళ్లినా ఇతర ప్రాంతాల నుంచి ఒక్కరూ రాలేదు. ఇక పంచాయతీల్లో పారిశుద్ధ్యం, ఇతర కార్యక్రమాలను పర్యవేక్షించే మండల పంచాయతీ అధికారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లగా దుమ్ముగూడెం ఎంపీవో ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక మేజర్ పంచాయతీ అశ్వారావుపేటకు ఈవో లేకుండా పోయారు. దమ్మపేట మండలానికి చెందిన ఓ ఈవో ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు.



అశ్వారావుపేట మండల పరిషత్ కార్యాలయం

పేదల గోడు వినే వారేరీ...

సాధారణంగా ఎంపీడీవో అంటే నిత్యం క్షేత్రస్థాయిలో పనులు, కార్యాలయ పనులు, ఉపాధిహామీ పనులను చక్కబెట్టటంతో పాటు వచ్చే పేదల సమస్యలను వింటూ పరిష్కారానికి కృషిచేస్తారు. వీటితో పాటు సమావేశాలు, జిల్లా అధికారులతో వీసీలు, టెలికాన్ఫరెన్స్‌లు, ప్రజాప్రతినిధుల పర్యటనలు నిత్యం ఉంటూనే ఉంటాయి. అంటే ఒక మండలంలో ఉన్న ఎంపీడీవోకు ఆ మండల పనులతోనే బిజీ అవుతుంది. మరో మండల బాధ్యతలు అంటే ఎలా ఉంటాయో ఇట్టే ఊహించవచ్చు. ఇక అశ్వారావుపేట మండల పరిషత్ కార్యాలయానికి వివిధ రకాల సమస్యలు చెప్పుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి గిరిజనులు, పేదలు వస్తుంటారు. ఈ సమస్యలు ఎక్కువగా ఎంపీడీవో పరిధిలోనే ఉంటాయి. ఎక్కువగా సమస్యల పరిష్కారం కూడా ఎంపీడీవో పరిధిలోనే ఉంటుంది. ప్రస్తుతం దమ్మపేట ఎంపీడీవో ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్నారు. నిత్యం అశ్వారావుపేటలో ఉండే పరిస్థితి లేదు. దీంతో ప్రజల గోడు వినేవారు లేరు.

ఆదర్శనగర్, నాయుడుపేటలో ఎమ్మెల్యే పాదయాత్ర

సమస్యలు వెల్లడించిన స్థానిక మహిళలు



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు, ఆగస్టు 16: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని మామిడితోట గుంపు, ఆదర్శనగర్, నాయుడుపేట ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఎమ్మెల్యే తమ ప్రాంతాలకు వస్తున్నాడని తెలుసుకున్న ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లేందుకు ఆసక్తి చూపారు. కట్టువాగు ప్రవాహాలు, వర్షపు నీరు బయటికి మరలే పరిస్థితులు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మహిళలు తెలిపారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక పోవడంతో రోడ్లపై నీరు నిలిచిపోతుందని, దీంతో అంతా అపరిశుభ్రత నెలకొంటుందని తెలిపారు. నాయుడు పేట ప్రాంతంలో నివాసముండే రిక్షా కార్మిక కుటుంబాలు కట్టువాగుకు తమ ప్రాంతంలో సీసీ సైడ్ వాల్ నిర్మాణాలు లేక పోవడంతో వాగు వచ్చినప్పుడల్లా ఈ ప్రాంతం అంతా జలమయం అవుతుందని, ఇళ్లలోని వరదతో పాములు వస్తున్నాయని తెలిపారు. వీధిలైట్లు, కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే పర్యటనలో పాల్గొన్న మణుగూరు మునిసిపల్ కమిషనర్‌కు పలు ఆదేశాలు జారీ చేశారు. డ్రైన్ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు తయారు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవీన్, శివ, కూచిపూడి బాబు, రెడ్డి, పాలమూరి రాజు, మధు, మాదాడి రాజేష్, చింతల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల ప్రారంభం

మండలంలోని సమితి సింగరాం, అశోక్ నగర్ ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తి చేసుకున్న పలు సీసీ రోడ్లను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమితి సింగారం, మామిడి తోట గుంపు, విద్యానగర్; పాత పోలీసు కాలనీ, రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతాల్లో రూ.26 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మామిడితోట గుంపు ప్రాంతంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ రామారావు, కాంగ్రెస్ నాయకులు నవీన్, శివ, బాబు, శ్రీనివాసరెడ్డి, మాదాడి రాజేష్, ఆనంద్, చింతల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మణుగూరు: మణుగూరు పట్టణంలోని ప్రజా భవన్‌లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. రూ.2,92,000 చెక్కులు మంజూరు కాగా వీటిని అశ్వాపురం, మణుగూరు మండలానికి చెందిన లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిరినకి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలను తనిఖీ చేసిన తహసీల్దార్



విద్యార్థుల హాజరును పరిశీలిస్తున్న తహసీల్దార్

దుమ్ముగూడెం, ఆగస్టు 16: దుమ్ముగూడెం కస్తూర్బా ఆశ్రమపాఠశాల, ఎస్సీ బాలుర వసతిగృహాలను తహసీల్దార్ అశోక్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. కస్తూర్బాలో విద్యార్థుల హాజరు, మెనూ అమలు, ఆహార పదార్థాల నాణ్యత, పరిసరాల పరిశుభ్రతలను పరిశీలించారు. తాగునీటి ఇబ్బందులను కస్తూరిబా స్పెషల్ ఆఫీసర్ తహసీల్దార్ దృష్టికి తీసుకురాగా, పరిష్కరించాలని మిషన్ భగీరథ ఏఈను తహసీల్దార్ ఫోనులో కోరారు. వంటశాల పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. అలాగే ఎస్సీ వసతి గృహం, ములకపాడు ప్రైవేట్ ఆర్వో వాటర్‌ప్లాంటుల పనితీరును పరిశీలించారు.

ధరణి లోపాలు పునరావృతం కావొద్దు

కొత్తగూడెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి వల్ల రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త రెవెన్యూ బిల్లు రాష్ట్ర రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రూపొందించాలని రైతుసంఘాల నేతలు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శేషగిరిభవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన రెవెన్యూ ముసాయిదా బిల్లుపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ముత్యాల విశ్వనాథం, ఏపూరి బ్రహ్మం, అన్నవరపు సత్యనారాయణ, కనగాల అనంతరాములు, ఊక్లానాయక్ మాట్లాడారు. రాష్ట్రంలో సమగ్రంగా భూములన్నీ రీ సర్వే చేసి రైతుల భూములన్నింటిని రికార్డుల్లోకి ఎక్కించాలని, గతంలో సాదా బైనామాల క్రమబద్ధీకరణ కోసం రైతులు దరఖాస్తులు చేసి ఉన్నారని, ఇంకా ఎవరైనా ఉంటే మరలా వారికి సాదా బైనామాపై భూముల క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశాన్ని కల్పించాలన్నారు. భూమిసాగు చేసుకున్నటువంటి పేద, చిన్న, సన్నకారు రైతుల పేర్లు రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించి వారందరికి పాస్ పుస్తకాలు మంజూరుచేయాలని, ఏజెన్సీలో పోడుసాగు చేసుకున్నటువంటి వేలాది మంది రైతులకు ఇంకా పట్టాలు మంజూరు కాలేదని, తక్షణమే వారందరికీ పట్టాలు మంజూరు చేయాలని కోరారు.



సమావేశంలో పాల్గొన్న రైతు సంఘాల నేతలు

హిందువులపై దాడికి నిరసనగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 16: బంగ్లాదేశ్‌లో హిందులపై జరుగుతున్న దాడులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, బంగ్లాలో నివసించే హిందువులను రక్షించాలని కోరుతూ అశ్వారావుపేటలో శుక్రవారం హిందు సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. భద్రాచలం రోడ్‌లోని కళ్యాణ మండపం నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ జంగారెడ్డిగూడెం రోడ్ వరకు కొనసాగింది. అనంతరం రాష్ట్రీయ రహదారిపై రింగ్‌రోడ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హిందువులపై ఊచకోతలు దారుణమన్నారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, దాడులపై ప్రపంచదేశాలు స్పందించాలని కోరారు. వివిధ సంఘాల నాయకులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.

పర్ణశాల రామాలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

దుమ్ముగూడెం, ఆగస్టు 16: పర్ణశాల రామాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా లక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకం, సామూహిక కుంకుమార్చన, సహస్ర నామార్చనలను శాస్త్రోక్తంగా జరిపించారు. అలాగే లక్ష్మీనగరం కనకదుర్గ ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా పలు చోట్ల మహిళలు తమ గృహాల్లో వరలక్ష్మి పూజలు చేశారు.

మా రామయ్య లేకుంటే మాకు బువ్వ లేదు..

స్వచ్ఛందంగా రామయ్య భూముల రక్షణకు వచ్చిన భద్రాద్రి ఆటో స్టాండ్ డ్రైవర్లు

భద్రాచలం, ఆగస్టు 16: భద్రాచలం రామాలయం దగ్గర ఆటో స్టాండు పెట్టుకొని ఆటోలు నడుపుకుంటున్న మాకు రామయ్య లేకుంటే బువ్వ లేదు.. రామయ్యే మాకు దిక్కు అంటూ భద్రాద్రి ఆటో స్టాండ్ డ్రైవర్లు పేర్కొన్నారు. భద్రాద్రి రామయ్య భూముల్లో ఏపీలోని పురుషోత్తపట్నంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిసి స్వచ్ఛందంగా భద్రాద్రి దేవస్థానానికి మద్దతుగా వచ్చినట్లు భద్రాద్రి రామాలయ అడ్డా ఆటో యూనియన్ డ్రైవర్లు విలేకర్లతో పేర్కొన్నారు. జై శ్రీరామ్ జైజై శ్రీరామ్ అంటూ దేవస్థానం అధికారులు, ఉద్యోగులతో కలిసి అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు వారికి మద్దతుగా వెళ్లారు. సాయంత్రం వరకు అక్రమ కట్టడాన్ని తొలగించే వరకూ అక్కడే ఉండి దేవస్థానం వారికి అండగా ఉండటమే కాకుండా అక్కడ నుంచి మహిళ ఉద్యోగులను, ఇతర సిబ్బందిని ఆటోల్లో స్వచ్ఛందంగా వారి గమ్యస్థానాలకు చేర్చారు. రామయ్యతోనే తమ జీవనం అంటూ వారు తమ జీవన గమనాన్ని తెలియజేశారు. రామయ్య భూములు ఆక్రమించుకుంటున్నారని విషయం విని ఆగలేక తాము కూడా తరలి వచ్చామని వారు పేర్కొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఆటో డ్రైవర్ల నాయకులు

కోదండరామ్‌కు ఎమ్మెల్సీ అభినందనీయం

భద్రాచలం, ఆగస్టు 16: తెలంగాణ మలివిడత ఉద్యమంలో ఎంతో కీలకంగా వ్యవహరించిన ప్రొఫెసర్ కోదండరామ్‌కు ఎమ్మెల్సీ ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని, ఇది అభినందనీయమని 1969 తెలంగాణ పోరాట యోధుడు, మలి విడత ఉద్యమకారులు, టీజేఎస్ సెంట్రల్ కమిటీ సభ్యులు తిప్పన సిద్దులు పేర్కొన్నారు. కోదండరామ్‌ను విద్యశాఖ మంత్రిగా నియమించాలని, దీని ద్వారా విద్యా వ్యవస్థ మరింత బలపడుతుందని ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పేద మహిళలకు చీరెల పంపిణీ



ఇల్లెందు టౌన్, ఆగస్టు 16: ఇల్లెందు పట్టణంలోని కాకతీయనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జె.దత్తం తన భార్య అరుణకుమారి జ్ఞాపకార్థం శుక్రవారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలైన అరుణకుమారి గత రెండు సంవత్సరాల క్రితం గుండెపోటుతో మృతి చెందింది. ఆమె జన్మదినం కావడంతో కాకతీయనగర్‌కు చెందిన పలువురు పేద మహిళలకు చీరెలను అందచేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయనగర్ ప్రముఖులు రేళ్ల సత్యం, రంజిత్, మధు తదితరులు పాల్గొన్నారు.

హత్యాచారం చేసిన వారిని శిక్షించాలి

ఇల్లెందు టౌన్, ఆగస్టు 16: కలకత్తాలో వైద్యా విద్యార్థినిపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి చంద్ర అరుణ, ప్రజాపంథా కొత్తగూడెం డివిజన్ నాయకుడు నాయిని రాజు, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి అజయ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ డిమాండ్ చేశారు. హత్యాచార సంఘటనను నిరసిస్తూ శుక్రవారం ఇల్లెందులో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం, వైఫల్యాల మూలంగా అత్యాచార సంఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, విద్యార్థినులు బస్సుల్లో ప్రయాణం సందర్భంగా అభద్రత భావానికి గురవుతున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు చేసిన నిరోధించలేకపోతున్నారని విమర్శించారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా జిల్లా నాయకులు బుర్రా వెంకన్న, అజ్మీర బిచ్చా, పీవోడబ్ల్యు జిల్లా కార్యదర్శి సావిత్రి, సబిత, వెంకటమ్మ, పద్మ, పీవైఎల్ నాయకులు మంగయ్య, శ్రీరామకోటయ్య, అరుణోదయ జిల్లా అధ్యక్షులు బుర్ర రాఘవులు, పీడీఎస్‌యూ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి బానోత్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

'కూలి భరోసా ఏర్పాటు చేయాలి'



మాట్లాడుతున్న సాబీర్ పాషా

కొత్తగూడెం, అగస్టు 16: వ్యవసాయ కార్మికులకు కూలి భరోసా పథకం ఏర్పాటు చేయాలని, కూలి భరోసా క్రింద ప్రతి నెల రూ.10వేలు ఇవ్వాలని బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కలకోట కాంతయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధి హామీ పథకం క్రింద పల్లెల్లో పని చేస్తున్న వ్యవసాయ కూలీలకు రోజుకు 500 రూపాయల వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, బీకేఎంయూ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, బీకేఎంయూ నాయకులు కల్లూరి వెంకటేశ్వర్లు, రేసు ఎల్లయ్య, సలీం, అలవాల సీతారాంరెడ్డి, గుగులోతు రాంచందర్, బండి నాగేశ్వరరావు, పేరాల శ్రీనివాస్, బానోత్ గోవింద్, ఊకే నారాయణ, రామకృష్ణ, ధర్మ, కేశవులు, దారా శ్రీనివాస్, బిక్కులాల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక

కొత్తగూడెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీని శుక్రవారం ఎన్నుకోవడం జరిగింది. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రేష్మ, అధ్యక్షురాలిగా జి.పద్మ, ప్రధాన కార్యదర్శిగా అరుణ, కోశాధికారిగా చంద్రలీల, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పాపారావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా ఇర్ప అనునాధ, రాము, షైమున్నీసా, సహాయ కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, సుల్తానా, రోజా, సత్యనారాయణతోపాటు మరో 16 మందిని జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు సీఐటీయూ అధ్యక్షులు కె.బ్రహ్మాచారి, జిల్లా కార్యదర్శి ఈజీ రమేష్ తెలిపారు.

ఆరోగ్యశ్రీ సిబ్బంది సమ్మె నోటీసు

జూలూరుపాడు, ఆగస్టు 16: తమ సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 20వ తేదీ తర్వాత సమ్మెలోకి దిగుతామని ఆరోగ్య మిత్రాలు డి.నర్సింహారావు, ఎన్‌వి. రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం జూలూరుపాడులో వైద్యాధికారి బి.వెంకటేశ్వర్లుకు వారు సమ్మె నోటీసును అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి తాము పని చేస్తున్నప్పటికీ తమ సమస్యలను ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆరోగ్యమిత్రాలకు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ హోదాను కల్పించి జీవో 60 ప్రకారం వేతనం రూ.22,750లు అందచేయాలని, వేతనాలను ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ట్రస్టు ద్వారా చెల్లించాలని కోరారు. ఆరోగ్యశ్రీలో ఖాళీ పోస్టులను భర్తీ చేసి ప్రమోషన్లను కల్పించాలని, ఉద్యోగులందరికి హెల్త్‌కార్డులు ఇవ్వాలని, విధి నిర్వహణలో మృతి చెందిన ఉద్యోగికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: జారే

దమ్మపేట, ఆగస్టు 16: పేదల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. దమ్మపేట మండల పరిధిలోని పలు గ్రామాలలో ప్రభుత్వం ద్వారా మంజూరైన 47 కళ్యాణలక్ష్మి చెక్కులు, 51 మందికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని ఎన్నికలలో ఇచ్చిన హామీలన్ని ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, మాజీ ఎంపీపీ సోయం ప్రసాదు, చిన్నంశెట్టి యుగంధర్, రావు గంగాదరరావు, మద్దిశెట్టి సత్యప్రసాదు, కక్కిరాల రమేష్, కొయ్యల అచ్యుతరావు, బొల్లికొండ నాగేశ్వరరావు, చిట్టినాయన, వాసం శ్రీను, ఎర్రా వసంతరావు, గూడపాటి వెంకట్రావ్, చీకటి శ్రీను, ఎర్ర ప్రసాదు, శ్రీరాముల ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

'వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి'

కరకగూడెం, ఆగస్టు 16: మండలంలోని ప్రజలు ప్రతీ ఒక్కరు తప్పకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కరకగూడెం వైద్యాధికారి కారం మధు తెలిపారు. శుక్రవారం మండలంలోని పద్మాపురం, గొళ్లగూడెం, కొలురు గ్రామాలలో ఫీవర్ సర్వే, హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా 21 మందికి జ్వరం ఉన్నట్లు గుర్తించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ.. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మురుగునీరు నిల్వ వలన మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉంటుందని ప్రత్యేక అవగాహన కల్పించారు.

'కాంట్రాక్టు కార్మికులపై పని భారం తగ్గించాలి'

ఇల్లెందు టౌన్, ఆగస్టు 16: ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో పని చేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులపై పని భారం తగ్గించాలని ప్రజాపంథా అనుబంధ ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి యాకూబ్ షావలి డిమాండ్ చేశారు. శుక్రవారం వైద్యశాల వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్యశాలలో సెక్యూరిటి గార్డు, ఎక్స్‌రే, ఇతర విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు రూ.10వేల వేతనం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా వైద్యశాలలోనే పని చేస్తున్నప్పటికీ అతితక్కువ వేతనాలు అందిస్తూ నామమాత్రంగా చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేషెంట్ కేర్ విభాగం, సెక్యూరిటి విభాగంలో పని చేసే కార్మికులపై పని భారం ఎక్కువ జీతం తక్కువగా ఉందని వివరించారు. ఐదు నెలల జీతాలకు ఒక్క నెల జీతం వేయడం వల్ల అప్పులభారం పెరుగుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ఇల్లెందు ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు, ఉమా, కృష్ణవేణి, వెంకటమ్మ, సుజాత, లక్ష్మి, రాము, రవి, పవన్, నిషార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాకూబ్ షావలి

న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



మొక్కను అందజేస్తున్న కలెక్టర్

బూర్గంపాడు, ఆగస్టు 16: హైకోర్టు జడ్జి కె.శరత్‌ను శుక్రవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మర్యాద పూర్వకంగా కలిసారు. బూర్గంపాడు మండల పరిదిలోని సారపాకలో గల ఐటీసీ గెస్ట్ హౌజ్‌లో జడ్జిని కలిసిన కలెక్టర్ మొక్కను అందజేశారు. అనంతరం స్థానిక పరిస్థితులపై చర్చించుకున్నారు.